క్లుప్తంగా

కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్

గోదావరిఖని: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త పనిచేయాలని రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ పిలుపునిచ్చారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శనివారం పాలకుర్తి, అంతర్గాం మండలాల ముఖ్య నాయకులు, గ్రామ అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. ప్రతీ ఒక్క కార్యకర్త కష్టపడి పనిచేయాలని, గ్రామస్థాయిలో ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మమేకం కావాలని సూచించారు. సమావేశంలో రెండు మండలాల కాంగ్రెస్ మండల అధ్యక్షులు, సీనియర్ నాయకులు, గ్రామ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సద్దుల బతుకమ్మ ఘాట్ శుభ్రం



సుల్తానాబాద్: పట్టణంలో సద్దుల బతుకమ్మ ఘాట్ వద్ద పరిసరాలను శనివారం మున్సిపల్ కార్మికులు శుభ్రం చేస్తున్నారు. మున్సిపల్ కార్మికులతో శుభ్రం చేయించడంతోపాటు లైట్లు బిగించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ రమేశ్ తెలిపారు. 29న పట్టణంలోని పలు ప్రాంతాల ప్రజలు ఇక్కడికే వచ్చి బతుకమ్మ ఆడి చెరువులో నిమజ్జనం చేయనున్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి



మాట్లాడుతున్న ఎంపీవో సమ్మిరెడ్డి

సుల్తానాబాద్: స్థానిక సంస్థలు పకడ్బందీగా నిర్వహించేలా పీవోలు, ఏపీవోలు వ్యవహరించాలని ఎంపీవో సమ్మిరెడ్డి ఆదేశించారు. మండల కేంద్రంలోని యశోద నరహరి ఫంక్షన్ హాల్‌లో శనివారం సుల్తానాబాద్, ఓదెల మండలాల్లోని పీఓ, ఏపీవోలకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. 300 మందికి శిక్షణ ఇచ్చారు. షబ్బీర్ పాషా, ఎంఈవో రాజయ్య, సాదిక్ పాషా, రాంరెడ్డి పాల్గొన్నారు.

ఆశ్రమ వృద్ధులకు దుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 21వ డివిజన్ వీర్లపల్లిలోని ఈశ్వరకృప వృద్ధాశ్రమంలో దసరా పండగను పురస్కరించుకొని వెలుగు సామాజిక స్వచ్ఛంద సంస్థ చైర్మన్ సురభి శ్రీధర్ ఆధ్వర్యంలో నూతన దుస్తులు పంపిణీ చేశారు. చైర్మన్ మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆఫ్ రామగుండం ఖాజాపురం రాజేందర్, క్లబ్ అధ్యక్షులు వడ్లకొండ ఎల్లప్ప, వేముల రమేశ్, ఉప్పల పవన్‌కుమార్, వెలుగు సామాజిక స్వచ్ఛంద ఆధ్వర్యంలో ఆశ్రమ వృద్ధులకు నూతన దుస్తులు పంపిణీ చేశామని తెలిపారు. ఆశ్రమ డైరెక్టర్లు ఎల్.మాధవరెడ్డి, ఆకిరెడ్డి రామచంద్రారావు, ఆశ్రమ గౌరవ సలహాదారుడు సీతారాంరెడ్డి పాల్గొన్నారు.

'విద్యుదాఘాతం' ఘటన స్థలం పరిశీలన



పరిశీలిస్తున్న అధికారుల బృందం

రామగుండం: రామగుండం బైపాస్ రోడ్డు సమీపంలోని క్రషర్‌నగర్ కాలనీలో హైటెన్షన్ విద్యుత్ తీగలకు కొక్కెలు తగిలించి విద్యుత్ చౌర్యం చేసే క్రమంలో ఇటీవల ముగ్గురు యువకులు షాక్‌కు గురైన విషయం తెలిసిందే. శనివారం ఘటన స్థలాన్ని టీజీఎన్‌పీడీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ వి.గంగాధర్, డీఈ (టెక్నికల్) బాలయ్య, గోదావరిఖని, రామగుండం ఏడీఈలు వెంకటేశ్వర్లు, రమేశ్, రామగుండం ఏఈ రవీందర్ పరిశీలించారు. విద్యుత్‌తీగలకు కొక్కెలు తగిలించి ప్రమాదాలు కొని తెచ్చుకోవద్దని సూచించారు.

ముత్తారం ఎస్సైగా రవికుమార్

ముత్తారం: ముత్తారం ఎస్సైగా రవికుమార్ శనివారం బాధ్యతలు చేపట్టారు. జయశంకర్ భూపాలపల్లిలో వీఆర్‌లో ఉన్న రవికుమార్ ముత్తారానికి రాగా, ఇక్కడ పనిచేసిన ఎస్సై నరేశ్ భూపాలపల్లి వీఆర్‌కు బదిలీ అయ్యారు.



డీజేలు వద్దు.. మన పాటలు ముద్దు



పెద్దపల్లిరూరల్: పూలతో పండగ జరుపుకునే సంప్రదాయం తెలంగాణ ప్రజల సొంతం. ఒకరు పాట పాడితే మిగతా వారందరూ చప్పట్లు కొడుతూ పాడేవాళ్లు. ఇప్పుడు ఆ చప్పట్లు లేవు. ఎవరికీ బతుకమ్మ పాటలు రావడం లేదు. డీజే పాటలకు డ్యాన్స్ చేస్తూ మన సంప్రదాయాన్ని అపహాస్యం చేస్తున్నారు. – కర్రె అర్చన, పెద్దపల్లి

మరుగున పడేలా చేస్తున్నారు



ఫెర్టిలైజర్‌సిటీ: తెలంగాణ సాంస్కృతిక వారసత్వాన్ని, ప్రకృతితో మహిళల అనుబంధాన్ని, భక్తి భావాన్ని బతుకమ్మ ప్రతిబింబిస్తుంది. అప్పట్లో బతుకమ్మ పాటలు స్త్రీల జీవనశైలి, కుటుంబ అనుబంధాలను చాటేలా ఉండేవి. నేటి యువతరం కోలాటం, డీజే పాటలతో బతుకమ్మ ప్రసిద్ధిని మరుగున పడేలా చేస్తున్నారు. – తాళ్ల లక్ష్మి, ఫెర్టిలైజర్‌సిటీ

బతుకమ్మ అంటేనే తల్లిగారిల్లు



యైటింక్లయిన్‌కాలనీ: బతుకమ్మ పండుగ వస్తుందంటేనే తల్లిగారిల్లు గుర్తుకు వస్తుంది. పండుగకు వారంరోజుల ముందుగానే తల్లిగారి ఇంటికి పిల్లలతో సహా వెళ్లి ఆడబిడ్డలతో పాటు అక్కాచెల్లెళ్లతో కలిసి బతుకమ్మ ఆడుకుంటారు. కుటుంబం సభ్యులందరూ సంతోషంతో ఆనందంగా గడుపుతారు. – తమ్మనవేణి సుజాత, యైటింక్లయిన్‌కాలనీ

దుర్గామాతకు ప్రత్యేక పూజలు



పెద్దపల్లిరూరల్: పట్టణంలో..



కాల్వశ్రీరాంపూర్‌లో కుంకుమ పూజలు



ముత్తారం: లక్కారంలో..



రామగుండం: బ్రాహ్మణపల్లి గ్రామంలో..



ఎలిగేడు: కుంకుమ పూజలో మహిళలు



ఫెర్టిలైజర్‌సిటీ: పూజల్లో భవానీ యూత్



సుల్తానాబాద్‌లో..

ఎలిగేడు/జూలపల్లి/సుల్తానాబాద్/ఫెర్టిలైజర్‌సిటీ/ముత్తారం/పాలకుర్తి/రామగుండం/కాల్వశ్రీరాంపూర్: దేవీ శరన్నవరాత్రులను పురస్కరించుకొని మండపాల్లో కొలువైన దుర్గామాతకు శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండపాల్లో కుంకుమపూజలు నిర్వహించి, అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి, తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు.

సంక్షిప్త వార్తలు

• బీజేపీ మండల అధ్యక్షుడిగా గాదె రంజిత్‌రెడ్డి

ఎలిగేడు: బీజేపీ మండల అధ్యక్షుడిగా బుర్హాన్ మియాపేటకు చెందిన గాదె రంజిత్‌రెడ్డిని నియమిస్తూ ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి కృషి చేసిన మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి, జిల్లా అధ్యక్షుడు, నాయకులకు, కార్యకర్తలకు రంజిత్‌రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

• ఎన్టీపీసీ లేబర్ గేట్ వద్ద స్వీట్ల పంపిణీ

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు గుర్తింపు సంఘం ఎన్నికల్లో బీఎంఎస్ అనుబంధ ఎన్టీపీసీ కార్మిక సంఘ్ విజయంపై స్వీట్లు పంపిణీ చేశారు. ప్రాజెక్టు లేబర్ గేట్ వద్ద కాంట్రాక్టు కార్మిక సంఘ్ ఆధ్వర్యంలో శనివారం కార్మికులకు స్వీట్లు పంపిణీ అధ్యక్షుడు బండారి కనకయ్య, పురుషోత్తం, త్రిదండ పాణి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

• నేత్ర, శరీరదాత కుటుంబానికి అభినందన పత్రం

యైటింక్లయిన్‌కాలనీ: నేత్ర, శరీర దాత రిటైర్డ్ ఎస్‌సీఆర్ మెడికల్ డైరెక్టర్ క్రీ.శే డాక్టర్ శ్రీనివాసుల సంస్మరణ సభను శనివారం సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మణికొండలోని గ్రీన్ లీవ్స్ బాంకెట్ హాల్‌లో నిర్వహించారు. నేత్ర, శరీర దాత కుటుంబ సభ్యులకు ఎల్వీప్రసాద్ కంటి ఆసుపత్రి ఫౌండర్ డాక్టర్ జి.నాగేశ్వరరావు చేతుల మీదుగా అభినందన పత్రం అందజేశారు. ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి లింగమూర్తి నేత్ర, శరీరదానాలపై అవగాహన కల్పించారు. డాక్టర్ శ్రీనివాసులను ఆదర్శంగా తీసుకొని ప్రతీఒక్కరు నేత్ర, శరీరదానాలకు ముందుకు రావాలని కోరారు.

• రేపు ఇసుక అక్రమ డంపులకు వేలం

రామగుండం: రామగుండం మండల పరిధిలోని వివిధ ప్రాంతాల్లో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంపులకు సోమవారం వేలం నిర్వహించనున్నట్లు రామగుండం తహసీల్దార్ శ్రీపాద ఈశ్వర్ తెలిపారు. ఇసుక అవసరం ఉన్న వారు రామగుండం తహసీల్ కార్యాలయంలో నిర్వహించే వేలంలో పాల్గొనాలని సూచించారు.

• నేడు బిల్డింగ్ వర్కర్స్‌యూనియన్ మహాసభ

గోదావరిఖని: జిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ 4వ మహాసభ 28న స్థానిక శ్రామికభవన్‌లో నిర్వహించనున్నట్లు నాయకులు వేల్పుల కుమారస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటం రాజు, జిల్లాలోని సీఐటీయూ అనుబంధ బిల్డింగ్ వర్కర్స్‌కు చెందిన వంద మంది ప్రతినిధులు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు.

• సోలార్ ప్లాంట్ కార్మికులకు బోనస్ అందించండి

రామగిరి: ఆర్జీ–3 ఏరియాలోని సోలార్ ప్లాంట్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు బోనస్ అందజేయాలని ఐఎన్‌టీయూసీ కాంట్రాక్టు కార్మిక సంఘం ఉడుత శంకర్, జిల్లా కార్యదర్శి కిరణ్‌రెడ్డి అన్నారు. ఆర్జీ–3 ఏరియా ఇంజినీర్ వై.వి.శేఖర్‌బాబుకు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సంవత్సరం ప్రకటించిన రూ.5500 బోనస్‌ను సోలార్ ప్లాంట్‌లో పనిచేసే కార్మికులను కాంట్రాక్ట్ కార్మికులుగా గుర్తించి అందించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

• ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో పంచ పరివర్తన్

పెద్దపల్లిరూరల్: హిందువుల్లో ఐక్యతను పెంచేందుకు పంచపరివర్తన్ పేరిట ఆర్‌ఎస్‌ఎస్ పాటుపడుతోందని విభాగ్ బౌద్ధిక్ ప్రముఖ్ సామల కిరణ్ అన్నారు. పెద్దపల్లిలోని అమర్‌చంద్ కళ్యాణమండపంలో శనివారం జరిగిన విజయదశమి ఉత్సవంలో మాట్లాడారు. 1925లో మొదలైన ఆర్‌ఎస్‌ఎస్ ఇప్పుడు దేశవ్యాప్తంగా విస్తృతశాఖల్లో విభిన్న రంగాల్లో దేశభక్తి, హిందుత్వ ఆధార సంస్థలతో పనిచేస్తోందన్నారు.

• మొక్కలు నాటిన పర్యావరణ ప్రేమికుడు

రామగిరి: మండల కేంద్రంలోని సెంటినరీకాలనీ పరిధిలో ఏర్పాటు చేసిన నాలుగు నూతన బస్టాండ్ల వద్ద శనివారం జాతీయ పర్యాటక దినోత్సవం సందర్భంగా పర్యావరణ ప్రేమికుడు గౌడ సత్తన్న మొక్కలు నాటారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మేకల మారుతి, శ్రీనివాస్, సమ్మయ్య, జంగ తిరుపతి, జంగ రాజయ్య, రవీందర్‌రెడ్డి, రమేశ్ పాల్గొన్నారు.

• ఆల్ ఇండియా ట్రెక్కింగ్ సాహస యాత్రకు జ్యోత్స్న

గోదావరిఖనిటౌన్: ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా కొండవీడులో జరిగే ఆల్ ఇండియా ట్రెక్కింగ్ సాహస యాత్రకు స్థానిక సెక్రెడ్ హార్ట్ పాఠశాల ఎన్‌సీసీ ఫస్ట్ ఆఫీసర్ జ్యోత్స్న 9వ బెటాలియన్ కరీంనగర్ నుంచి ఎన్నికయ్యారు. నిజామాబాద్ గ్రూప్ తరపున ఈ ట్రెక్కింగ్–3లో పాల్గొననున్నారు.

స్థానిక ఎన్నికల నిర్వహణపై శిక్షణ



మాట్లాడుతున్న డీఎల్‌పీవో కొంరయ్య

రామగిరి: స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై శనివారం సెంటినరికాలనీ జేఎన్టీయూ కళాశాలలో ప్రిసైడింగ్ అధికారుల (పీవో)లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక సంస్థలు ఎన్నికలు–2025 అంశంపై రామగిరి, ముత్తారం, కమాన్‌పూర్, మంథని మండలాలకు చెందిన 289 మంది ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మంథని డీఎల్‌పీవో ఎం.కొమురయ్య, ట్రైనింగ్ అధికారులు ప్రిసైడింగ్ అధికారులకు స్థానిక సంస్థల నిర్వాహణ గురించి అవగాహన కల్పించారు. అనంతరం పీవోలకు ఎన్నికల శిక్షణ పత్రాలు అందజేశారు. రామగిరి, కమాన్‌పూర్ ఎంపీవోలు ఉమేశ్, మారుతి పాల్గొన్నారు.

లయన్స్ సేవలు విస్తరిస్తాం



నిత్యావసరాలు అందిస్తున్న కోదండరాములు

ధర్మారం: లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలను మండల, పట్టణ ప్రాంతాలతో పాటు మారుమూల గ్రామాలకు విస్తరిస్తామని లయన్స్ జిల్లా గవర్నర్ సింహరాజు కోదండ రాములు అన్నారు. ధర్మారం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో కేంద్రంలో శనివారం రాత్రి ధర్మారం లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు ఇప్ప మల్లేశం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బతుకమ్మ సంబరాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మండలంలోని 25మంది నిరుపేదలు, నిరుపేద వితంతువులకు నెలరోజులకు సరిపడా నిత్యావసరాలు అందించారు. తర్వాత బతుకమ్మ కార్యక్రమాన్ని మాజీ ఎంపీపీ ముత్యాల కరుణశ్రీతో కలిసి ప్రారంభించారు. విజేతలను ఎంపిక చేసి బహుమతులు అందించారు. లయన్స్ ప్రోగ్రాం చైర్మన్ తన్నీరు రాజేందర్, ట్రెజరరీ మిట్టపల్లి చంద్రకాంత్ రెడ్డి, రీజనల్ చైర్‌పర్సన్ కామిని శ్రీనివాస్, జోన్ చైర్‌పర్సన్ మునీందర్‌రెడ్డి, జిల్లా అడ్మిన్ సామ ఎల్లారెడ్డి, ఫాస్టు ప్రెసిడెంట్ తలమక్కి రవీందర్‌శెట్టి, గడ్డం లింగారెడ్డి, కేబినెట్ సెక్రటరీ వాసుదేవరెడ్డి, కోఆర్డినేటర్ ఇనుగుర్తి రమేశ్, తన్నీరు పద్మ, ఇప్ప సరోజ, కట్ట మంగ పాల్గొన్నారు.

వర్షపు నీటితో నిండిన అండర్‌బ్రిడ్జిలు



ఓదెల రైల్వేఅండర్‌బ్రిడ్జిలో నలిచిన వరద నీరు

ఓదెల: ఓదెల, కొత్తపల్లి, ఉప్పరపల్లి రైల్వేస్టేషన్ల సమీపంలోని అండర్‌బ్రిడ్జిలు వర్షం నీటితో నిండడంతో శనివారం రాకపోకలు బంద్ అయ్యాయి. కొమిర, పందిల్ల, పెద్దపల్లి, పెద్దబొంకూరు, ఉప్పరపల్లె గ్రామాలకు చెందిన ప్రయాణికులు అవస్థలు పడ్డారు. రైల్వేశాఖ అదనంగా మోటార్లు ఏర్పాటు చేసిన వర్షంనీరు బయటకు పంపాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పంటల సాగు వివరాలపై క్షేత్ర పరిశీలన

రామగుండం: రైతులు తమ భూముల్లో సాగుచేసే పంటల వివరాలను అక్టోబర్ 15లోగా కచ్చితంగా నమోదు చేసుకోవాలని అంతర్గాం మండల వ్యవసాయాధికారి కల్వల సతీశ్ కోరారు. అంతర్గాం మండల పరిధిలోని ఆకెనపల్లి, పొట్యాల, బ్రాహ్మణపల్లి గ్రామాల్లో శనివారం క్షేత్ర పరిశీలన చేసి రైతులను కలిసి సాగు చేస్తున్న పంట వివరాలు, విస్తీర్ణం , వినియోగించే ఎరువుల వివరాలు సేకరించారు. రైతులు పంట వివరాలు విధిగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఒకవేళ రైతులు ప్రస్తుతం ఉన్న పంట తొలగించి మరో పంట సాగుచేస్తున్నా వాటి వివరాలు కూడా నమోదు చేసుకోవాలన్నారు. ఏఈవో హరీశ్ ఉన్నారు.

జాతీయస్థాయిలో రాణించేలా ప్రోత్సహిస్తాం



పెద్దపల్లిరూరల్: స్టేడియం పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లిరూరల్: జిల్లా కేంద్రమైన పెద్దపల్లిలో బ్యాడ్మింటన్ ఇండోర్ స్టేడియం పనులను శనివారం ఎమ్మెల్యే విజయరమణారావు ప్రారంభించారు. గతంలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ కోసం నిర్మించి అసంపూర్తిగా వదిలేసిన పనులను ఇండోర్ స్టేడియంగా మార్పు చేస్తున్నట్లు పేర్కొన్నారు. బ్యాడ్మింటన్ క్రీడాకారులకు ప్రోత్సాహం అందించేందుకు ఈ స్టేడియం ఉపకరిస్తుందన్నారు. ఈ ప్రాంతం నుంచి రాష్ట్ర, జాతీయస్థాయిలో రాణించేలా బ్యాడ్మింటన్ క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు ప్రోత్సహిస్తామని పేర్కొన్నారు. మార్కెట్ చైర్మన్ ఈర్ల స్వరూప పాల్గొన్నారు.

ఐటీఐ ఆవరణలో స్విమ్మింగ్ పూల్..

పెద్దపల్లి ప్రాంత ప్రజలు ఆరోగ్యం కోసం వ్యాయామం చేసేందుకు ప్రభుత్వ ఐటీఐ ఆవరణలో వాకింగ్ ట్రాక్ పనులు చేపడతామని, అలాగే స్విమ్మింగ్‌పూల్ ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్యే ప్రకటించారు. స్విమ్మింగ్ పూల్ నిర్మాణానికి రూ.కోటిన్నర నిధులను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. స్విమ్మింగ్ పూల్ నిర్మాణ పనులు త్వరలోనే మొదలవుతాయని పేర్కొన్నారు.

21నెలల్లో రూ.15కోట్ల పనులు..

సుల్తానాబాద్: పట్టణంలోని పూసాల రోడ్డులో శనివారం రాత్రి రూ.2.కోట్ల50 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, సెంట్రల్ లైటింగ్‌ను ఎమ్మెల్యే విజయరమణారావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ 21 నెలల్లో రూ.15కోట్ల పనులు పట్టణంలో జరిగాయని, మరో రూ.15 కోట్ల పనులు త్వరలో టెండర్ పిలవనున్నట్లు పేర్కొన్నారు. తెలిపారు. మున్సిపల్ కమిషనర్ తిప్పరాజు రమేశ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్యగౌడ్, మార్కెట్ చైర్మన్ మినుపాల ప్రకాశ్‌రావు, సింగిల్ విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, మార్కెట్ మాజీ చైర్మన్ సాయిరి మహేందర్, పడాల అజయ్‌గౌడ్, చక్రధర్ మల్లారెడ్డి, కాంగ్రెస్ నాయకులు డి.దామోదర్‌రావు, అబ్బయ్యగౌడ్, పన్నాల రాములు, చిలుక సతీశ్, అమిరిశెట్టి రాజలింగం, తిరుపతి, కుమార్ కిషోర్, రాజయ్య, స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షులు రవీందర్, ప్రభాకర్, జగన్ పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యం

ఓదెల: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. మండలంలోని పొత్కపల్లి, జీలకుంట, గుండ్లపల్లి గ్రామాల్లో శనివారం పలు అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం పొత్కపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మండలంలో ఎలాంటి సమస్యలు లేకుండా పరిష్కరిస్తామని, అభివృద్ధి పనుల కోసం నిధులు మంజూరయ్యాయన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మూల ప్రేంసాగర్‌రెడ్డి, పెద్దపల్లి మార్కెట్ చైర్మన్ ఈర్ల స్వరూప, పొత్కపల్లి సింగిల్‌విండో చైర్మన్ ఆళ్ల సుమన్‌రెడ్డి, మాజీ చైర్మన్ గోపు నారాయణరెడ్డి, తహసీల్దార్ ధీరజ్‌కుమార్, మాజీ వైస్ఎంపీపీ పిట్టల రవికుమార్, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బైరి రవిగౌడ్, నాయకులు మధు, శంకర్, స్వామి, రాజయ్య పాల్గొన్నారు.

జీఎం కార్యాలయంలో బతుకమ్మ ఆటాపాట



బతుకమ్మ ఆడుతున్న ఆర్జీ-3, ఏపీఏ సేవా సమితి అధ్యక్షులు అలివేణి, వెంకటలక్ష్మి

రామగిరి: 'బతుకమ్మ పండుగ మన సంస్కృతికి ప్రతీక అని, ఆడుపడుచులంతా ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు' అని ఆర్జీ–3, ఏపీఏ జీఎంలు నరేంద్ర సుధాకర్‌రావు, కొలిపాక నాగేశ్వరరావు అన్నారు. జీఎం కార్యాలయంలో శనివారం ఆర్జీ–3, ఏపీఏ సేవాసమితి అధ్యక్షులు నరేంద్ర అలివేణి, కొలిపాక వెంకటలక్ష్మి, అధికారులు, కార్యాలయ మహిళా ఉద్యోగులు, కాంట్రాక్టు మహిళా ఉద్యోగులతో కలిసి బతుకమ్మ ఆటాపాట నిర్వహించారు. జీఎంలు మాట్లాడుతూ సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో 29న సాయంత్రం 6గంటలకు సెంటినరీకాలనీ రాణిరుద్రమదేవి క్రీడా ప్రాంగణంలో నిర్వహించనున్న సద్దుల బతుకమ్మ, ఫ్యామిలి డే వేడుకల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఎస్‌హోటూ జీఎం బండి సత్యనారాయణ, పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, అధికారులు పి.రాజేశం, శ్యామల పాల్గొన్నారు.

ముందస్తు సద్దుల బతుకమ్మ వేడుకలు



మంథనిరూరల్: వేడుకల్లో వైద్యులు, సిబ్బంది



ఫెర్టిలైజర్‌సిటీ: బతుకమ్మ ఆడుతున్న సిబ్బంది



సుల్తానాబాద్ మున్సిపల్ కార్యాలయం ఎదుట..



రామగుండం: తబితా ఆశ్రమంలో..



ఎలిగేడు: ఎంపీడీవో కార్యాలయంలో..

మంథనిరూరల్/సుల్తానాబాద్/రామగుండం/ఫెర్టిలైజర్‌సిటీ/ఎలిగేడు: జిల్లాలోని పలు ప్రాంతాల్లో శనివారం ముందస్తు సద్దుల బతుకమ్మ సంబరాలు జరుపుకున్నారు. మంథని మండలం గద్దలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో, రామగుండం కార్పొరేషన్ 21వ డివిజన్ లక్ష్మీపురం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో, సుల్తానాబాద్ మున్సిపల్ కార్యాలయంలో, రామగుండం పట్టణంలోని తబితా ఆశ్రమంలో, ఎలిగేడు ఎంపీడీవో కార్యాలయంలో బతుకమ్మ సంబరాలు జరుపుకున్నారు.

ఆబాది భూమిలో అక్రమ వెంచర్లు

మంథని: మున్సిపాలిటీ పరిధిలోని కూచిరాజుపల్లి శివారులో ఆబాది భూమిలో అక్రమ పట్టాలు సృష్టించి ప్లాంటింగ్ చేస్తున్నారని బోయిన్‌పేటకు చెందిన నాయిని సంతోష్ ఆరోపించారు. వెంచర్‌కి సంబంధించిన సర్వే నంబర్లు అన్ని సేతువార్, కాసరా, ఆబాది భూమిగా గవర్నమెంట్ భూమిగా రెవెన్యూ రికార్డులు ఉన్నట్లు పేర్కొన్నారు. అంతేగాకుండా బఫర్ జోన్లలో నిర్మాణం చేశారన్నారు. కొంతమంది ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన భూమి ఉన్నట్టుగా సేతివారు రికార్డు చెప్తోందన్నారు. దీనిపై రీసర్వే చేయించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయ సాధనకు కృషి



సుల్తానాబాద్: నివాళి అర్పిస్తున్న పెద్దపల్లి ఎమ్మెల్యే



కోల్‌సిటీ: నివాళి అర్పిస్తున్న అధికారులు



ధర్మారం: పూలమాల వేస్తున్న సంఘం నాయకులు



ఓదెలలో..

కోల్‌సిటీ/సుల్తానాబాద్/కమాన్‌పూర్/యైటింక్లయిన్‌కాలనీ/ఓదెల/జూలపల్లి/ధర్మారం: స్వాతంత్ర్య సమరయోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయ సాధనకు కృషి చేయాలని పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పిలుపునిచ్చారు. శనివారం కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

ఆస్ట్రేలియాలో పూల పండుగ





కాల్వశ్రీరాంపూర్: ఆస్ట్రేలియాలో తెలుగు ప్రజలు బతుకమ్మ వేడుకలు ఘనంగా జరుపుకుంటున్నారు. ఆస్ట్రేలియాలోని సిడ్నీలో ఆస్ట్రేలియా తెలంగాణ స్టేట్ అసోసియేషన్ నేతృత్వంలో ఏటా బతుకమ్మ వేడుకలు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది గిర్వేని హైస్కూల్లో బతుకమ్మ సంబరాలు జరుపుకుంటున్నట్లు అసోసియేషన్ సభ్యులు పేర్కొన్నారు.